# ఆరిన కుంపటి

పురాణం సూర్యప్రకాశరావు

భళ్లున తెల్లవారింది. అప్పుడే రైలువచ్చి స్టేషన్‌లో ఆగింది. బండి దిగిన ప్రయాణీకులతోనూ, వాళ్లకోసం ఒకళ్లని వొకళ్లు తోసుకుంటూ ముందుకువచ్చే బళ్లవాళ్ళతోనూ నిండిపోయింది కూడలి.

బైట వీధిలో సందడికి మెలుకువ వచ్చిన గడ్డంతాత లేచి కళ్ళు నులుపుకుంటూ వీధిలోకొచ్చి పంపుదగ్గర ముఖం కడుక్కుని మళ్లీ స్తంభంచాటుకెళ్లి చతికిలబడి ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. అదో చిన్న సత్రవు లాంటిది. గడ్డంతాత నాలుగు రోజుల్నించీ అందులోనే పడుకుంటున్నాడు. అంతకు ముందు అయిదురోజులు ఆ పంచనీ ఈ పంచనీ కాలక్షేపం చేశాడు. రోజూ ఎవరో కొత్త వాళ్లు వస్తుంటారు పోతుంటారు. ఈ నాలుగు రోజుల్లోనూ అనేకతరహాల వ్యక్తులు తారసిల్లి వింతవింత విషయాలెన్నో స్ఫురింపచేసి మెరుపులా మాయమయ్యారు. చిలిపికళ్ల పొట్టిపిల్ల రాత్రికిరాత్రి నిద్రలో జేబులో వున్న నాలుగణాలూ కాజేసి తెల్లారేసరికి మాయమయి ఊరుకుంది. మోసగించిందను కోవటానికి అతని మనసు వొప్పుకోవటం లేదు. ఆమనిషి తనకి కలిగించినతృప్తి అటువంటిది. కేవలం కొన్ని గంటలూ, నిముషాల్లో ఆ మనిషిరూపం తన మనోనేత్రంలో ముద్రవేసుకుని శాశ్వతంగా తిష్ఠవేసుకుని కూర్చుంది. ఆ రోజుల్లో తన కర్తవ్యాన్నే మరిపింపచేసిన ఆ చిలిపికళ్లు తిన్ని మోసం చేశాయని తెలిసినప్పుడు కోపంకంటె జాలే ఎక్కువగా బాధపెట్టింది. "నాలుగణాలకోసం ఎంతనాటకం ఆడింది! నిజాయితీగా అడిగితే ఇస్తానని—అంత భారీగా, నా దృష్టితో చూడగలగటం అనుకున్నంత సులువు కాదు.. హు! అయినా ఇప్పుడా గొడవెందుకు?"–గడ్డంమనిషి ముఖంలో హాసరేఖలు వికృతంగా మెలికలు తిరిగాయి. లోతుకుపోయిన కళ్లు, నలుపెక్కిన కంటిగూళ్లు, అట్టలుకట్టినజుట్టూ అన్నీ అతని సహజమైన అందాన్ని నాశనంచేశాయి. ఇటీవల మరీ ఇలా మారిపోయాడు కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి. వెన్నుపూస తన వ్యక్తిత్వంలాగానే వంగిపోయి పాతికేళ్ళ వయస్సుకు మరో పాతిక సంవత్సరాలుకలిపి పెద్దవాణ్ణి చేసింది అందుకనే పిల్లలు కొంతమంది అప్పుడే అతణ్ణి "తాతా! తాతా!" అని పిలుస్తూంటారు. కొత్తలో చ్రురుకుని అరికాలు మంట నెత్తికెక్కేది.

గడ్డంతాత నెత్తి బరుక్కుంటూ స్తంభానికి చారబడి ఆలోచిస్తున్నాడు. దూరంగా పిల్లలు ఆడుకుంటున్నారు. కంటిముందు కనిపించే ప్రతిప్రాణినీ తనతో పోల్చుకోవటం అతనికి ఇటీవల బాగా అలవాటయిపోయింది. ఆ అలవాటుప్రకారమే ఇప్పుడూ ఆ పిల్లలతో తన్ని పోల్చుకుంటున్నాడు: "వాళ్లకీతనకిమల్లేనేఆకలిఉంటుంది. వాళ్ళకీ సమస్యలుంటాయి. అయితే ఏ సమస్యకీ ఎక్కువసేపు వాళ్ళని బాధపెట్టగల శక్తిలేదు. చంచలమైన మనస్సులు. తను?..." అతను నవ్వుకున్నాడు. ఆ నవ్వు నవ్వులామటుకు లేదు.

సాయంత్రం పార్క్‌లో కూర్చున్నప్పుడుకూడా నెత్తిమీంచి అరుచుకుంటూ ఎగిరిపోయే రకరకాల పక్షుల్ని ఇలాగే తనతో పోల్చుకుంటూంటాడు. ఈ సృష్టిలో తనుతప్ప అంతా సుఖపడుతున్నట్టే భావిస్తూంటాడు. ఇలా భావిస్తున్నప్పుడు మనసులో ఏదో కసిగా, క్రోధంగా ఉన్నట్టు ఫీలవుతూంటాడు. ఎవరిమీద? ఏమో? అతనికే స్పష్టంగా తెలియదు. వీధినపడితే ఎక్కేగుమ్మం, దిగేగుమ్మం, విసుగూ విరామంలేకుండా రాత్రి పదింటిదాకా తిరిగి తిరిగి ఆ సత్రవుకు చేరుకుంటాడు. కడుపునిండా మంచినీళు తాగి నిద్రకి జారుకుంటే రాత్రి అపపా దడపా క్షుద్బాధకి మెలుకువ వచ్చేస్తూంటుంది. అలాగే మూలుగుతూ ముక్కుతూ ఈ పదిరోజులూ ఎలాగో గడిపేశాడు. ఇన్నాళ్ళూ బొత్తిగా నిరాహారంగా గడపకపోయినా మొత్తానికి ఈ పద్ధతిని ఇంకో నాలుగురోజులు సాగితే ఈ ప్రమిదలో చమురు హరించుకుపోయి దీపం ఆరిపోతుం దనటానికి ఏవీ సందేహం లేదు. బ్రతుకుమీద మమత, కోరికలు సిద్ధించాలనే అభిలాష అతనిలో ఏమాత్రం చావలేదు.

"నాయనా నువ్వెవరవు?" అని అతన్ని ఎవరూ పలకరించరు. ఎవరికీ పలకరించ బుద్ధిపుట్టదు. "తనతో వాళ్ళకి ఏం పనుంటుంది గనక పలకరించటానికి?" అనుకుని మొదట మొదట సర్దుకోబోయినా ఇటీవల అందరూ తనవైపు అదోమాదిరిగా పిచ్చివాడివైపు చూస్తున్నట్టుగా చూస్తూండటంబట్టి వీళ్లందరికీ తనంటే ఓవిధమైన సానుభూతి (ఆ సానుభూతి తన కేవిధంగానూ ఉపయోగించక పోయినా) తప్పించి ఒక మామూలు మనిషి కిచ్చే గౌరవం తన కివ్వటం లేదని అతను గ్రహించాడు. అతని మనస్సు చివుక్కుమన్నా ఆ తలంపు అతని హృదయాన్ని శాశ్వతంగా అంటిపెట్టుకొని బాధించలేదు. ఉన్నట్టుండి అతడి దృష్టి తన తల్లి దండ్రులవైపుకు మళ్లింది. అతని కళ్లు చెమ్మగిల్లాయి. పాతికేళ్లు నెత్తిమీదికొచ్చి ఇన్నాళ్ళూ వాళ్ళరెక్కల కష్టం తింటూకూర్చుంటే తన కర్తవ్యం, తన బాధ్యత తను నెరవేర్చుకోవాలనే పట్టుదల రేకెత్తించాడు తండ్రి. తండ్రి ఎగిరిపడి ఇంట్లోంచి పొమ్మంటే తల్లి అడ్డుపడినా (తన కింకా ఆత్మాభిమానం చావని రోజులు) చరచరా వీధిలోకి నడిచాడు. దగ్గర కొంతపైకం ఉన్నా టిక్కెట్ లేకుండా రైలెక్కి వాళ్లెక్కడ దింపితే అక్కడ దిగి మళ్లీ మరోబండి ఎక్కి అలా వందమైళ్ళు ప్రయాణంచేసి ఈ ఊరులో అడుగుపెట్టాడు. ఈ ఊరు తనకి ఆశ్రయమిస్తుందనే నమ్మకం కలిగింది. వచ్చి పదిరోజు లయింది. అనుకున్నట్టుగా యేదీ జరుగలేదు. అయినా ఇంకో నాలుగురోజులు ఓపికపడదామని మనసులో ఉంది. కాని... ఆకలి... ప్రేగులు తెగిపోయే బాధ!... మొదట్లో కేవలం తండ్రిమాటలకు కోపం వచ్చి, పౌరుషం వచ్చి పారిపోయినా చివరికది పట్టుదలగా పరిణమించి ఉద్యోగం చెయ్యటం తనధర్మం, కర్తవ్యం అనేభావనలోకి వచ్చాడు. అందుకనే తండ్రంటే ఇప్పుడంత కోపంలేదు కాని పట్టుదల! తల్లి ముఖం మనస్సులో మెదిలితే హృదయం కరిగిపోతుంది. కాని పట్టుదల!

ఇలా పారిపోయి రావటానికి మరో దిలాసా అతన్ని ఇలా ప్రోత్సహించింది. ఇన్నాళ్ళూ తిని తిరిగి వేళకి గూటికి

# ★ ఆరిన కుంపటి ★

చేరుకునే పద్ధతి అతని మెదడున్ని బాగా తుప్పుపట్టించేసింది. ఈ ప్రపంచంలో ఏమూల ఏమిజరుగుతూందో ఈ ప్రజలమధ్య సమస్యలేమిటో, బ్రతకటమంటే ఏమిటో, అతని కంతవరకూ ఏమీపట్టలేదు. "హు! ఇంత విశాలమైన ప్రపంచంలో నాఒక్క పొట్టకి ఇంత అన్నం దొరకదా?" అనే బిలాసా అతన్ని వెనకచూపూ, ముందు చూపూలేకుండా ఆ అర్ధరాత్రి ముసురులో ఈదురుగాలిలో బండెక్కించింది. తను వెళ్లటంయేవిటి పట్నంలో ఏదోపనిలో ప్రవేశించి హాయిగా కాలుమీద కాలు వేసుకుని గడిచిపోయిన రోజులకంటె హాయిగా గడపవచ్చని అతను ఊహించాడు. "మొదటి నెలజీతం రాగానే కొంత తండ్రిపేర మనియార్డర్ చేస్తాను. క్రింద రాస్తాను. "నేనంత అసమర్థుణ్ని కానని బుజువు చేసుకున్నాను" అని. తండ్రి నివ్వెరబోతాడు. క్షమాపణ చెప్పుకుంటూ జాబురాస్తాడు. అప్పుడు తను కనికరించి వాళ్లనికూడా తీసుకొచ్చి తన దగ్గర పెట్టుకుంటాడు..." ఇలా సాగిపోయాయి అతని ఆలోచనలు రైల్లో కూర్చున్నంతసేపూను. ఈ ప్రపంచంలో బ్రతకగలగటం అన్నది కేవలం తన అసమర్థత, సమర్థతలకి సంబంధించినదే అనుకున్న అతను యీ అభిప్రాయం తప్పని తెలుసుకోవటానికి యెక్కువకాలం పట్టలేదు. ఉదాహరణకు తను చదవగలడు రాయగలడు. అయినా తనకి ఏ ఆఫీసులోనూ ఉద్యోగం దొరకలేదు. శారీరకంగా యెంతటి కష్టమైనా సునాయాసంగా నిర్వహించగలడు. ఏనా ఏ ఫ్యాక్టరీలోనూ తనకు పని దొరకలేదు. ఇవన్నీ తనఅభిప్రాయాన్ని నిర్దాక్షిణ్యంగా ఖండిస్తున్నాయి. మొదట్లో అంటే వచ్చిన కొత్తలో నోరుతెరచి "ఏదైనా ఉద్యోగం ఉంటే యిప్పిస్తారా" అని అడగటానికి కూడా అభిమానపడ్డాడు. "ఏమైనా ఖాళీలున్నాయా?" అని ఘరానాగా అడిగాడు. అధికారి కస్సుమనిలేచి బయటికి పొమ్మన్నాడు. అతనిమనసులో తండ్రి బింబం చెరిగిపోయి ఆ స్థానాన్ని యీ అధికారి ఆక్రమించాడు. "తను యెప్పుడో వొకప్పుడు బుద్ధిచెప్పాల్సిన మనుష్యుల్లో ఇతను రెండవవాడు" అని కసిగా అనుకున్నాడు మనసులో. ఓరగా అతని వైపుచూస్తూ ఇవతలికి వచ్చాడు. ఇది అతని ఉద్యోగాన్వేషణలో మొదటిఘట్టం. ఈ అనుభవాన్ని ఆధారంచేసుకుని అతను ముందు జరగబోయేదాన్ని అంచనా వెయ్యలేక పోయాడు. ఆ తర్వాత నాలుగయిదు రోజుల్లో ఇటువంటి అనుభవాలు ఎన్నో జరిగాయి. జేబులో పైకంకూడా ఖాళీ అయిపోగానే ప్రపంచంగురించి రెండో వైపునించి ఆలోచించటం మొదలుపెట్టాడు. తండ్రిమాటల్ని మనసుకు పట్టించుకోక ఆ యింట్లోనే, వాళ్ళమధ్యనే ఉండిఉంటే తెలుసుకోలేనంతటి బ్రహ్మాండమైన ప్రపంచజ్ఞానాన్ని ఈ వారం రోజుల్లోనూ అతను సేకరించుకున్నాడు. ఇప్పుడతని మనసులో తండ్రిగాని, కస్సుమని ఎగిరిపడిన అధికారిగాని ఎవరూ లేరు. వారిద్దరిస్థానే ఇప్పుడు భయం ఆక్రమించింది. గుండెల్ని నమిలిమింగే భయం! తర్వాత తర్వాతబాధ ఆక్రమించింది. బాధ! క్షుద్బాధ! కండలుతిరిగిన దండలతో, కొరమీసంతో, నునుపుతేరిన శరీరాన్ని పీల్చి పిప్పిచేసి ఎండబెట్టిన ఒరుగులాచేసిన క్షుద్బాధ! ఆ తర్వాత ఆత్మాభిమానమే ఆహారంగా ఎంతకాలమో గడపలేకపోయాడు. కొద్దిరోజుల్లో అది కాస్తా ఖర్చయిపోయింది. చివరికి ఆత్మాభిమానం చంపుకోవటంవల్లకూడా ఏమంత ప్రయోజనం కనిపించలేదు. నోరుతెరిచి చెయ్యిచాపితే పెట్టేదాత కనిపించలా! వీధి అరుగుమీద కూర్చుని అడుక్కునే కుంటి తాతయ్యని కసిరికొట్టినఘట్టాలు జ్ఞప్తికొచ్చాయి. ఏడవలేక నవ్వుకున్నాడతను. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లోనే "పోనీ ఇంటికి పోతేనో" అని మనస్సు వెనక్కి పీకింది. కాని ఎవరో వెన్నుతట్టి చెప్పినట్టుగా తనకుటుంబ తనకే ఆ పని సబబుగా తోచలేదు. "అక్కడకుటుంబ యేముంది తినటానికి? తను బాగుపడాలి. అంటే సంపాదించాలి. అదీ తన ధర్మం! తల్లిదండ్రుల్ని పోషించేశక్తిగలవాడుగా కాకపోయినా తన పొట్ట తను పోషించుకోగలిగి వుండాలి.

"గడ్డంతాత" అని అతనికి వోచిన్న పిల్లవాడు పేరుపెట్టాడు. వాడల్లాగే తన్ని పిలుస్తుంటాడు. వాణ్ని బట్టి అందరూను. మిగతాపిల్లలు వాడల్లా పిలుస్తుంటే కిలకిలా నవ్వుతూంటారు. అతనూ నవ్వుతూంటాడు గడ్డం సవరించుకుంటూను. వాళ్లతో గడిపే ఆకాసేపూ ఏ చీకూ చింతా లేకుండా వుంటుంది. తలుపులన్నీ బంధించబడి చీకటిగుయ్యారంగా వున్న అతని హృదయమందిరంలోకి యీ పిల్లలు కిటికీ రెక్కలు కొద్దిగా తెరిచి సన్నని వెలుగు జీర ప్రసరింపచేశారు. మళ్లీ టప్పున ఆ కిటికీరెక్కలు మూసి మెరుపులా పిల్లలు మాయమై పోతుంటారు. చీకటి ఆ కాస్త వెలుతురునూ కబళించి యెప్పటిమాదిరిగా రాజ్యంచేస్తుంది. సముద్రానికికూడా అవతలిగట్టు అంటూ ఉండకుండావుంటుందా? కాకపోతే మన కంటికి కనిపించనంతటి దూరంలో వుంటుంది. అలాగే యీ అన్వేషణ అనంతమైనదికాదేమో. అని ఆశగా అనుకుంటాడు అతను. నిజానికి ఆశ లేకపోతే జీవితం ఏముంది? కష్టపడ్డా సుఖపడ్డా దానికి కారణభూతం ఆశ.

ఆ ఉదయమే గడ్డాలతాత మరో కొత్త సహచరుని సంపాదించాడు. అతనొక్కడే తన్ని ఇన్నాళ్లకి "నువ్వెవరవు?" అని అడిగినవాడు. ప్రాణం లేచివొచ్చినట్టయింది తనకి.

"నీ పేరు?"-ఇది ఆ కొత్తవ్యక్తి వేసిన రెండో ప్రశ్న.

గడ్డాలతాత తన చరిత్రనంతా పూసగుచ్చినట్టుగా అతని చెవినివేశాడు. విని అతను జాలిపడ్డట్టుగా కనిపించలేదు. "ఒకే తరగతికి చెందినవాళ్ళం తమాషాగా కలిశాం" అన్నాడతను.

"అంటేఁ?" అయోమయంగా ప్రశ్నించాడు గడ్డాలతాత.

"నా ధ్యేయంకూడా అదే."

అమాంతం రెండుచేతులూ అతని చుట్టూ వేసి కౌగలించుకున్నాడు గడ్డాలతాత. తన్ని నోరువిప్పి ఆప్యాయంగా పలకరించే మనిషి కోసం ముఖం వాచిపోయిన గడ్డాలతాత ఆ కాసేపూ అన్ని సమస్యలూ మర్చిపోగలిగాడు. చిన్నపిల్లల సమక్షంలో తను పొందగలిగిన సంతృప్తి, విశ్రాంతి ఇప్పుడు మళ్లీ పొందగలిగాడు. ఆత్మీయుడు ముందు మసులుతున్నట్టుగా అనిపించింది. "నువ్వెవరవు? నీ పేరేమిటి?" అని అడిగాడు గడ్డంతాత.

ఈ ఇద్దర్నీ వింతగా చూస్తూ నిలబడ్డ చిన్నకుర్రాడొకడు వెకిలిగా నవ్వుతూ "పిల్లికళ్లబూచి" అంటూ పారిపోయాడు.

ఆ కొత్తమనిషికి కోపంవచ్చి చర్రుమని లేచాడు. గడ్డాలతాత అతన్ని వారించి "వాళ్ళే నాకు గడ్డాలతాత అని పేరుపెట్టారు. మొదట్లో నీకుమల్లేనే నాకూ కోపంవచ్చింది. కాని రానురాను వాళ్ళే నాకు ఆప్తులయారు. పసిపిల్లలు" అన్నాడు.

అలాగా అన్నట్టుగా పిల్లికళ్లబూచి గడ్డంతాత ముఖంలోకి చూసి అంతకోపం దిగమింగుకుని నవ్వేశాడు. "నా పేరు...ఏదైతేనేం లే! వాళ్లు పెట్టారుగా. 'పిల్లికళ్లబూచీ' అని. అలాగే పిలు" అంటూ ఆ నవ్వు పాకి



గించాడు. గడ్డాల తాత ఆ నవ్వుతో శృతి కలిపాడు.

ఆ రెండు కంఠాలూ నవ్వుకు మొహం వాచిపోయినట్టుగా నాలుగు గోడలూ ప్రతి ధ్వనించేలా పగలబడ్డాయి.

"నీ దే వూరు?" గడ్డంతాత ప్రశ్నించాడు.

"అబ్బో చాలాదూరం."

"ఇంతదూరం దేనికొచ్చినట్టు?"

బూచి నవ్వుతూ పొట్టకొట్టుకున్నాడు.

అర్థం అయిందన్నట్టుగా తలూగించాడు గడ్డం తాత.

"అయితే ఎక్కడన్నా దొరికిందా ఉద్యోగం?" గడ్డంతాత ప్రశ్నించాడు.

"లేదు"- ఆ కంఠస్వరంలో ఏదో కసీ, కోపం ధ్వనించాయి.

"ఏం చేద్దాం అనుకుంటున్నావు?"

"నువ్వేం చేద్దాం అనుకుంటున్నావు?"

గడ్డాలతాత కన్నీరు ఆపుకుందామని చేసిన ప్రయత్నాలు వ్యర్థమైపోయాయి. బావురుమని రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. అంతలో నవ్వు! అంతలో ఏడుపు! బూచీ కొంత కంగారుపడ్డాడు. "ఏడవకు! ప్రయత్నిద్దాం. దొరక్క పోతుందా" అంటూ ఓదార్చాడు.

"మా అమ్మా నాన్నా అందర్నీ వదిలేసి వచ్చాను. ముందూ వెనకా దారి కానరావటం లేదు" అంటూ మళ్లీ రాగాలుతీశాడు గడ్డాల తాత.

"నేనూ అంతే."

"ఆ! నువ్వూ మీ అమ్మా నాన్నా వాళ్లని వదిలేసి వచ్చావా?" అని ఆశ్చర్యముగా అడిగాడు గడ్డాలతాత.

"తల్లీ తండ్రీ లేరుగాని భార్యా పిల్లలూ ఉన్నారు."

"ఎలాగైతేనేం. అయితే వాళ్లనెందుకు వదిలేసి వచ్చావు?"

"నేను వట్టి అసమర్థుణ్ణని నా భార్య అభిప్రాయపడింది. ఓ రాత్రిపూట పిల్లల్ని తీసుకుని పారిపోయింది. చుట్టుపక్కల ఊళ్లన్నీ గాలించాను. ప్రయోజనం లేకపోయింది. ఇలా వచ్చేశాను."

గడ్డాల తాత నవ్వాడు. "నువ్వు జరిగిందంతా పూర్తిగా చెప్పటంలేదు. కొంత దాస్తున్నావు కదూ?" అన్నాడు.

బూచి ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాడు.

"నీ సమర్థతని ఋజువు చేసుకుందు కోసమని ఆమెని చిత్తుగా తన్నివుంటావు. అందుకే ఆమె పారిపోయి ఉంటుంది. అంతేనా?"- గడ్డాల తాత ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాడు.

బూచీముఖం ఎఱ్ఱబడింది. తర్వాత తెప్పరిల్లి "నీ కెలా తెలుసు?" అని అడిగాడు.

గడ్డాలతాత భయంకరంగా నవ్వాడు. ఆ నవ్వు పొడిగిస్తూనే "అమాత్రం ఊహించలేనూ. నీ చెప్పే తీరే చెబుతోంది" అన్నాడు.

"నువ్వు చాలా తెలివైనవాడివిలా గున్నావు. ఇట్టే గ్రహించేశావు. నువ్వు చెప్పింది నిజమే. కొట్టాను. అందుకే పారిపోయింది. ఎలాగున్నారో? ఎక్కడున్నారో?"

"పోనీలే బూచీ బాధపడకు. ఎప్పుడో ఒకప్పుడు మీరంతా కలుసుకుంటారు. నాకా నమ్మకం ఉంది" అంటూ ఓదార్చాడు గడ్డాలతాత.

"హు! ఒకటే కలవటం" అంటూ నిరాశగా మూలిగాడు బూచీ.

అప్పటికే ఎండ బాగా వడిదిరిగింది కొచ్చింది ఇద్దరికడుపుల్లో ప్రేగులూ అరుపులు మొదలు పెట్టాయి ఒకళ్లని వొకళ్లు వోదార్చుకుంటూ ఒకళ్ల భవిష్యత్తు గురించి వొకళ్లు హామీలు యిచ్చుకుంటూ, జోస్యాలు చెప్పుకుంటూ గతించిపోయిన మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ మధ్యాహ్నం మూడింటివరకు గడిపేశారు. "నేనలా వెళ్లొస్తాను" అంటూ బూచీ లేచాడు. గడ్డాలతాతకి సందేహం పట్టుకుంది. కొద్దిక్షణాల్లో అది ఆశగా మారింది. 'నేనూ రానా నీతో' అందామనుకున్నాడు. కానీ అనలేకపోయాడు. బూచీ భోజనానికి వెళుతున్నాడనీ, అతనికెక్కడో ఆ ఆధారం దొరికివుంటుందనీ,


# జయంతి ట్యుటోరియల్ కాలేజి

నెం. 48, హారిస్‌రోడ్, పుదుపేట, మద్రాసు - 2.

## జయంతి కాలేజీలో జయం నిశ్చయం

గత సెషన్ అతులిత ఫలితం

## 100-కి 93 మంది ఉత్తీర్ణులు

ఉన్నత విద్యలో ఉత్తమ శిక్షణ

ఈ కాలేజీ ప్రొఫెసర్లు-

అనేక సంవత్సరాల అనుభవంతో

ఆరితేరిన అధ్యాపకులు. మాటలు వేయునేల?-

ఈ విద్యాపీఠము

## విద్యార్థుల కల్పకంబు - వినరా ఆంధ్రా!

ఈ క్రింది పరీక్షలకు చదివేవారికి సలక్షణమైన శిక్షణ:

(I) I. A. (II) I. A. Sc. (III) B. Sc (IV) B. A.

సకల యంత్రసాధన రసాయన సంపత్తిగల లాబొరేటరీ

స్వగృహాలతో సాటిగా సర్వ సౌకర్యాలు గల హాస్టలు

1956 సం॥ మార్చి పరీక్షలకు

## 9-11-55 నుంచి క్లాసులు ప్రారంభం

"తామసించి చేయదగ దెట్టి కార్యంబు"

వెంటనే దరఖాస్తు పంపండి.

రు. 0-4-0 పోస్టు చీట్లు పంపినవారికి కాలేజీని గూర్చిన సమగ్ర వివరములు గల ప్రాస్పెక్టస్ పంపబడును.

**జయంతి లక్ష్మీనారాయణ, ఎం. ఏ., ప్రిన్సిపాల్.**

గడ్డాలతాత ఊహ. అతనితో వెళ్ళితే తనకి కూడా యింత అన్నం దొరుకుతుందేమోనని ఆశ. అయినా యింత ఆప్యాయంగా మాటలాడినవాడు తన్ని కూడా రమ్మనమని పిలవకూడదూ?" అని కోపం కూడా వచ్చింది అతనికి. గుమ్మం దాకా వెళ్ళిన బూచీ తిరిగి వెనక్కి వచ్చి "ఇంకో గంటలో వస్తాను. ఇక్కడే ఉంటావా?" అని ప్రశ్నించాడు.

మనస్సులో ఎటూ తెగని ఆలోచనలని పుటుక్కున తెంచేసి "నేనూ నీతో వస్తాను పద" అన్నాడు గడ్డాలతాత. అందుకు సమ్మతి అంత సులువుగా వస్తుందని అనుకోని గడ్డాలతాత ఆనందాతిశయంతో అతన్ని అనుసరించాడు. నిన్న వుదయం అనగా తిన్న తిండి. కడుపు రాసుకుంటూ ఇటూ అటూ వెర్రిగా చూస్తూ బూచీ వెంట నడవసాగాడు. బూచీ మటుకు నిశ్చలమైన దృక్కులతో ఎదురు చూపుతోనే నడుస్తున్నాడు.

"అబ్బ పాదాలు కాల్తున్నాయి బూచీ" అన్నాడు గడ్డాలతాత.

"ఇంకా అలవాటు పడలా?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"నిన్ననే జోడు పూర్తిగా తుక్కుతుక్కయిపోయింది. కాలవలో పారేశాను. అరికాళ్లు బొబ్బలెక్కుతున్నాయి."

"నాకా బాధ లేదు. నా అరికాళ్లు కాయలు కాచిపోయాయి. ఎంత ఎండలో అయినా నడవగల్ను. నాలుగు రోజులు పోతే నీకూ అంతేలే అలవాటయి పోతుంది" అన్నాడు బూచీ ఓదారుస్తున్నట్టుగా.

ఇద్దరూ కలిసి చాలా దూరం నడిచారు. మెయిన్ రోడ్డుమీద జనసందడి అంతగా లేదు. ఎండ నడినెత్తిమీద గునపంపోటు పొడిచినట్టుగా బాధ పెడుతోంది. ఆశాపాశం ఆ యిద్దర్నీ బంధించి తీసుకుపోతోంది. "కడుపు కింత తిండిపడితే చాలు" అనుకుంటున్నాడు గడ్డంతాత. పైకి తెగించి అడగలేకపోతున్నాడు. అందులో సందేహం లేదు. అతను వెళ్ళేది అందుకోసమేనని తనకి గట్టినమ్మకం. 'అయినా కదిపిచూద్దాం' అనుకుని "అయితే బూచీ నువ్వు అన్నం తిన్నావా?" అని లౌక్యంగా అడిగాడు.

"ఇంతవరకూ తినలేదు" అని సమాధానం వచ్చింది.

"ఇకముందు తింటాడన్నమాట" అనుకున్నాడు గడ్డంతాత అతనన్నమాటని తనకు అనుకూలంగా అన్వయించుకుని. తనూ వెళ్ళటంవల్ల అతని వాటా తగ్గిపోతుందేమో అనైనా లేకుండా బూచీ తన్ని వెంటబెట్టుకుని వెడుతున్నాడంటే ఈ ఒక్క నిదర్శనాన్ని బట్టే అతని స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు అనుకున్నాడు గడ్డంతాత. "బూచీ స్వార్థపరుడు కాడు. మహా త్యాగగుణం కలవాడు." ఇలా అతనిగురించి కొన్ని అభిప్రాయాలు స్థిరపడిపోయాయి అతనిమీద అనిర్వచనీయమైన అభిమానం అల్లుకుంటోంది మనసులో. "బూచీ నీ స్నేహం నాకు లభించటం నా అదృష్టంసుమా" అన్నాడు గడ్డాలతాత.

"ఏం? ఏవిటా అదృష్టం?"

"నువ్వు చాలా మంచివాడివి కనుక."

"నా మంచితనం ఏం చూశావు?"

"నువ్విలా ప్రశ్నిస్తే కచ్చితంగా జవాబు చెప్పలేను. నిన్ను చూసిన మొదటిక్షణంలో అలా అనుకున్నాను. ఎందుకూ అంటే సమాధానం స్పష్టంగా చెప్పలేను" అన్నాడు షాగుకుతున్నట్టు కనిపించకుండా.

ఇద్దరూ మెయిన్ రోడ్డులోంచి సందులోకి మళ్ళారు. ఆ సందులోంచి మరో సందులోకి మళ్లారు. ఇరుకుసందు. గాలీ వెలుతురూ చొరని ఆ ప్రదేశం అంతా దోమలమయం. పాడు దుర్వాసన ప్రక్కనే ఉన్న మురుగుకాలవ పొంగి రోడ్డుమీదికి పారుతోంది. చెత్తబుట్టలోంచి చెత్తంతా కెలికి నానా చీదరగానూ వీధంతా చిమ్మేస్తున్నాయి కుక్కలు. ఇద్దరు ముసలమ్మలు జుట్టు బరుక్కుంటూ గుమ్మంలో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. బూచీ వాళ్లని తప్పుకుని లోపలికి నడిచాడు. గడ్డంతాత అతన్ని అనుసరించాడు. "నువ్విక్కడ కూర్చో. ఇప్పుడే వచ్చేస్తా" అంటూ బూచీ లోపలికి వెళ్లాడు.

గడ్డంతాతకి మరో గట్టి చిక్కు వచ్చిపడింది. "తన్నిక్కడ కూచోమని వీడు లోపలికెళ్లి మెక్కుతాడు కాబోలు" అనే అనుమానం పట్టుకుంది. ఎలా తను అతన్ని అనుసరించటం? అరె! అతను వెళ్ళిపోయాడే లోపలికి! మంచివాడు మంచివాడనుకుంటే ఇదన్నమాట వాడు చేసేపని. ఇంత స్నేహముగావుండి తోడిమిత్రుడికి తను తినే అన్న



ములో యింతపడేస్తే ఏం పోయింది. ఆమాత్రం ఔదార్యం చూపించటం అతని ధర్మం కాదూ?" - గడ్డంతాత వేలమీద చతికిలపడి నాలిక చప్పరించుకుంటూ బూచీ వెళ్ళినవైపు చూస్తూ కూర్చుండిపోయాడు. "లోపల కడుపునిండా తింటూంటాడు! హు! తిను కడుపులోమాడుతూంటే బాగా యిక్కడ కూర్చున్నాడు. ఇక సహించలేక పోయాడు గడ్డంతాత. ఒక్క ఊపున లేచి ఇంట్లోకి దూరబడి గదిలోకి చూచాడు గుమ్మంలో నిలబడి. కంటిముందు కనిపిస్తున్న దృశ్యం అతన్ని నిలువునా కృంగదీసి ఆశాభంగం చేసింది సిగ్గుతో తలవంచుకుని అలాగే నిలబడిపోయాడు. బూచీ విస్తరాకు ముందు కూచుని చేతిలో అన్నం ముద్దతో ఉంటాడని ఊహించినగడ్డంతాత ఆచేతుల్లో ఒక లావుపాటివ్యక్తి పాదాల్ని మటుకు చూడగలిగాడు. బూచీ ఏదో ప్రార్థిస్తున్నాడు. ఆ లావుపాటి వ్యక్తి ముఖం చిట్లించుకుని "లాభంలేదు! వెళ్ళు వెళ్ళు!" అంటున్నాడు.

క్షణం అలా నిశ్చేష్టుడై నిలబడి తర్వాత వెనక్కి తిరిగి వచ్చేశాడు గడ్డంతాత. నేరుగా రోడ్డుమీదికి వచ్చి నిలబడ్డాడు. పశ్చాత్తాపంతో అతను కృంగిపోతున్నాడు. మరో నిమిషంలో తలవంచుకుని దిగులుగా బయటికి వచ్చాడు బూచీ. అతన్ని పలకరించటానికి కూడా ఏదో తప్పు చేసినవాడిలా గడ్డం తాత మనసు ఒప్పటం లేదు.

"వారం రోజుల్నించి తిరుగుతున్నాను. కొట్లో పనిప్పిస్తానని ఆశపెట్టి ఆశపెట్టి ఇప్పుడు ఎవరికో ఇప్పించేశాట్ట. చూడు ఎంత న్యాయంగా ఉందో. నాకడుపు తరుక్కుపోతోంది" అన్నాడు బూచీ కళ్ళు తుడుచుకుంటూ. గడ్డంతాత మనసులో బాధ రెట్టింపయింది. ఓపక్క కడుపులో ఆకలిబాధ! మరో పక్క నిష్కృతి మనిషిని రెండువైపుల్నించీ అంటిస్తున్నాయి.

"అయితే ఉద్యోగంకోసమా ఇక్కడికి వచ్చింది?". అడిగాడు గడ్డం తాత.

అవునన్నట్టుగా తలూపాడు బూచీ.

గడ్డంతాత ఇంకేదో అడగాలనుకుంటూంటే బూచీ పక్కకి తప్పుకుని దూరంగా గోడవారనున్న పంపువైపుకి చరచరా నడిచాడు. వెనక్కి తిరిగి "దా. కాసిని మంచినీళ్ళు తాగుదాం" అని గడ్డంతాతని కూడా పిలిచాడు. గడ్డం తాత అతని వెనకాలే నడిచాడు. ఏవేవో ఊహిస్తాం! ఏవో జరుగుతూంటాయి. ఈ భంగపాటు ఒక్కొక్కప్పుడు మనిషిని అంటిపెట్టుకుని దహించివేస్తుంది. మరొకప్పుడు వాటిని లక్ష్యపెట్టకుండా అంటీ అంటనట్టుగా నిబ్బరంగా మసులుకుంటాం.

ఆ ఇద్దరూ ఆరోజల్లా కలిసి మెలిసి గడిపేశారు. సాయంత్రం చీకటిపడే వేళకి బూచీ లేచి "వెళ్తున్నాను. మళ్ళీ రెండు రోజులుపోయింతర్వాత కన్పిస్తాను. ఇక్కడే ఉంటావుగా" అంటూ చేత్తో నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు.

గడ్డం తాతకి గుండెల్లో రాయిపడినట్టయింది. "వెళ్ళిపోతావా?" అన్నాడు దిగులుగా. అతను ఏకారణంవల్లనైనా యీ ప్రయాణం ఆపుకున్నట్లయితే అతను తనకి చేయగలిగినంత ఉపకారం చేసినట్టుగా భావించి, తృప్తిపడి, అందుకు తను కృతజ్ఞుడై ఉండగలడు. కాని బూచీ అగేట్టుగాలేడు. ప్రవాహ వేగంలో దారీతెన్నూ లేకుండా కొట్టుకుపోతున్న తనకి తనేకాకుండా ఆ ప్రవాహ వేగంలో కొట్టుకుపోతున్న మరో మనిషిని నేనున్నానంటూ బూచీ తనలో కొంత ధైర్యాన్ని చొప్పించి మరుక్షణంలో అంతూ పంతూ లేకుండా తన్ని ఒంటరిగా వదిలేసి మాయమై పోతున్నాడు. "అయినా మళ్ళీ వస్తానంటున్నాడుగా" అనుకుని సర్దుకున్నాడు.

బూచీని వీధివరకూ సాగనంపి రెండు రోజులు పోయింతర్వాత మళ్ళీ కనిపించటానికి హామీతీసుకుని వదలలేక వదలలేక వెనక్కి తిరిగి వచ్చాడు గడ్డం తాత.

కనుచూపు మేరవరకూ పరిసరాలన్నీ అందమైన దృశ్యాన్ని చూసి ఆనందించగలిగే మనసులకి ఉల్లాసం కలిగిస్తున్నాయి. గడ్డం తాతమటుకు వెనక్కి తిరిగి సంధ్యాఛాయల్ని చీల్చుకుంటూ వెళ్ళిపోయే బూచీ వైపే చూస్తూండిపోయాడు. బూచీ మసక చీకటిలో కలిసిపోగానే లోపలికి వచ్చి స్తంభానికి చారబడి కడుపు రాసుకుంటూ కూర్చుండిపోయాడు. అప్పటిదాక కడుపులో కావన్న గంతులు వేస్తూ వచ్చాయి. అంతవరకూ బూచీ సమక్షంలో ఎక్కడో దాక్కున్న ఆకలి ఇప్పుడు దాని శక్తినంతా కూడగట్టుకుని విజృంభించింది. అలా యెంతసేపో కూచోలేకపోయాడు. లేచి మళ్ళీ వీధిలోపడ్డాడు. సందులూ గొందులూ తిరిగి తిరిగి చివరికి కాళ్ళల్లో సత్తువ తగ్గి నేలకూలే పరిస్థితిలో ఓ అమ్మ దయతలచి ఇంత అన్నం పడేసి ప్రాణదానం చేసి తలుపేసుకుని లోపలికి పోయింది. అలానిలబడే ఆత్రంగా కుక్కుకుని కడుపులో మిగత ఖాళీని మంచినీళ్ళతో నింపి ఠీవిగా నవ్వుకుంటూ, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ తన స్థావరానికి తిరిగివచ్చాడు గడ్డంతాత. మళ్ళీ మొర్నాడు సాయంత్రంవరకూ ఆబాధ ఉండదు. సాయంత్రం ఏడు గంటల్నించి రాత్రి ఎనిమిదింటివరకూ ఆకలిగురించి ఆలోచించినమనిషి ఇప్పుడు మళ్ళీ ప్రపంచంగురించిన ఆలోచనల్లో పడ్డాడు. బూచీ గురించి కొంతసేపు ఆలోచించాడు.

రాత్రి బాగా పొద్దుపోయింది. మోచేయిమీద తలఆన్చి పడుకున్న గడ్డంతాత నిద్రకి జారుకున్నాడు. మూతి నాక్కుంటూ, ఒళ్ళు గోరుక్కుంటూ లోపలికివచ్చిన ఊరకుక్క అతనిపక్కనేవచ్చి పడుకుని దాని పనిలో అది మగ్నురాలైపోయింది. దూరంగా వినిపించే కుక్క మొరుగుల్నీ, ఉండి వుండి వినిపించే చిన్న చిన్న ధ్వనుల్నీ మధ్య మధ్య చెవులు రిక్కించి ఆలకిస్తోంది. పాలారాని మొద్దబ్బాయిలా నోటికి తాళం వేసుకుని నిశ్శబ్దత వహించింది రాత్రి.

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి గడ్డం తాత ఉద్యోగాన్వేషణలో ఊరిలో చాలాభాగం చుట్టేశాడు. తిరిగి తిరిగి ఒంతెన దగ్గర కొచ్చేసరికి అక్కడికి కొద్దిదూరంలో పెద్దపెద్దగొట్టాలూ, వాటిల్లోంచి సుళ్ళు తిరుగుతూ మేఘాలు మేఘాలుగా ఆకాశంలోకి

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
కండపుష్టికి. వీర్యవృద్ధికి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు-17

కలిసిపోతున్న పొగ కనిపించి ముందుకు వేసిన అడుగు వెనక్కి తీసి అటువైపుగా నడిచాడు.

అది పెద్ద ఫ్యాక్టరీ! ఊరు వచ్చి పది రోజులైనా ఈ ప్రాంతానికి రావటం ఇదె మొదటిసారి. గొప్పుకుంటూ సైకిల్ రిక్షా తొక్కుతున్న వాడ్ని ఆపి అదేమిటని అడిగాడు.

"సిమెంటు ఫ్యాక్టరీ. సిమెంటు తయారు చేస్తారక్కడ" అంటూ వాడు మళ్ళీ తన పాదాలను వలయాకారంలో తిప్పుతూ



# ★ ఆరిన కుంపటి ★

లేస్తూ కూచుంటూ తన శక్తినంతా కాళ్లలో కేంద్రీకరించి ఎగువకి పోయాడు.

గడ్డంతాత "ఓ రాయి అటూ వేసి చూద్దాం" అనుకుని ఆ ఫ్యాక్టరీవైపుగా నడిచాడు. సమీపిస్తున్నకొద్దీ ఆ కర్మాగారంలోని భాగాలన్నీ కళ్లకి మరింత స్ఫుటంగా పెద్దవిగా కనిపించి గుండెలు గుబులు గుబులు మన్నాయి. ఒక్కొక్క యంత్రంముందు ఒక్కొక్క మనిషి ఎంత అల్పంగా, ఎంత సూక్ష్మంగా కనిపిస్తున్నారు! ఎంత విచిత్రం! మనిషి సృష్టించిన యంత్రాలు మనిషినే మింగేస్తున్నాయా అన్నట్టుగా అక్కడి వాళ్లంతా ఒంటికి సిమెంటు కొట్టుకుపోయి ఆకారాలు మారిపోయి వికారంగా కనిపిస్తున్నారు. బీభత్సంగా అవుపిస్తున్నారు "ఇలా అయితే ఈ మనుష్యులు ఎంతకాలం బ్రతుకుతారు?" అనుకుంటూ ముందుకు నడిచాడు గడ్డంతాత. నేలంతా సిమెంటు మయం.

వెనకనించి "ఎవరది?" అంటూ అధికార పూర్వకంగా అరిచింది ఓగొంతు. గడ్డంతాత ఆగిపోయి వెనక్కి తిరిగి దండం పెట్టి "ఏదైనా పనుంటే యిప్పించండిదొరా" అన్నాడు అధికారికి కొద్దిదూరంలో నిలబడి.

"ఏంపని చేస్తావు?"

"ఏదైనాసరే..." అతనికళ్లు మిల మిలా మెరిసిపోయాయి. వంచిన తల నిలబెట్టి ఉత్సాహంగా కొద్దిముందుకు జరిగాడు. ఆశారేఖలు అతని ముఖాన్ని ఉద్దీపనం చేస్తున్నాయి.

"రాయగలవా?"

"ఊఁ!"

"కూలిపని చెయ్యగలవా?"

"ఊఁ!"

"అయితే ఎల్లుండి పొద్దయం ఇక్కడికొచ్చి నాకు కనిపించు. ఫ్యాక్టరిసైరన్ కూస్తుంది. ఆ వేళకల్లా వచ్చేయాలి." ఆనందాతిశయంతో పెదవులు వణికాయి గడ్డంతాతకి. కల్లో యేదో జరుగుతున్నట్టుగా వుంది. కాళ్లు తేలిపోతున్నాయి మళ్లీ తండ్రి మనసులో మెదిలాడు కాని పశ్చాత్తాపపడలేదు. ఇంట్లోంచి పారిపోయి వచ్చినప్పటి అతని ఊహలు యెలాసాగాయో ఇప్పుడూ అలాగే సాగిపోయాయి. గతం మర్చిపోయి వంగిననడుం గర్వంగా నిలబెట్టి "చిత్తం! అలాగే వస్తానుదొరా" అంటూ దగ్గరగా వచ్చి నాలుగు స్తోత్రపాఠాలు చెప్పి దండం


ఆస్పిరిన్ (అసిటిల్ - సలిసిలిక్ ఆసిడ్) లేకుండా అద్భుతమైన బాధోపశమనము

సారిడన్

నొప్పిని

తరిమివేయును



2 అణాలు

ప్రతి బిళ్ల ఒక పూర్తి మోతాదు

మీ కడుపుకు అస్వస్థతలు కలగవు.
ఇది పుచ్చుకొన్న తరువాత ఏ విధమైన
అలసట. నిరుత్సాహములు కలగవు

మీకు తలనొప్పి. పంటినొప్పి లేక ఏ నొప్పి అయినా వచ్చిన వెంటనే సారిడన్ పుచ్చుకోండి సారిడన్. మీ కడుపుకు అస్వస్థత కలుగనీయకుండా లేక మీకు ఏ విధమైన అలసట. నిరుత్సాహములు లేకుండా దాదాపు తక్షణం బాధోపశమనము చేయును

కాని సారిడన్ అంతటితో ఆగక యింకా ఎక్కువే చేస్తుంది అది త్వరలోనే మిమ్మల్ని శాంతముగ మరియు సంతోషముగ ఉండేలా చేయును బాధవలన కలిగే నరములు బిగించుకుపోవుట నుండి ఉపశమనము నిచ్చును. కొంచెము సేపట్లో మీరు మళ్లీ చురుకుగ మరియు ఉత్సాహముగ ఉన్నట్లు ఉంటారు.

మీవద్ద ఎల్లప్పుడూ కొన్ని బిళ్లలు సారిడన్ ఉంచుకొని అది వట్టి నొప్పికి మందుకంటె యింకా ఎక్కువే చేస్తుందని మీకు మీరే నిర్ధారణ చేసుకోండి

నొప్పిని పోగొట్టును

సారిడన్ దాదాపు తక్షణం బాధను పోగొట్టును — అనేక సమయాల్లో నొప్పిని పోగొట్టుటకు ఒక రెండు అణాల బిళ్ల చాలును.

విశ్రాంతి నిచ్చును

సారిడన్ నొప్పివలన కలిగే బిగించబడిన నరముల అనుభవము నుండి ఉపశమనము చేకూర్చును.

నవోత్సాహము చేకూర్చును

సారిడన్ మీకు సౌమ్యముగ ఉత్తేజము కలిగించి కొన్ని నిమిషాల్లోనే శక్తి ఉత్సాహములు పొందేలా చేయును





VT 1388

పెట్టి వెనక్కి తిరగ్గానే "అప్పుడే వెళ్ళి పోతున్నావే నీ పేరేమిటో చెప్పావు కావు?" అంటూ ప్రశ్నించాడు అధికారి.

తండ్రి పెట్టిన పేరు 'కామేశ్వర రావు' అని చెప్పటానికి సంకోచించి "కావన్న అంటారు" అని నసిగాడు. అధికారి ఈ పేరు నోటుబుక్కులో రాసుకుని "రోజుకు రూపాయిస్తాం" అన్నాడు.

"తమ చిత్తం!"

"సరే వెళ్లు" అని అధికారి ఎవరిమీదో కోరు పారేసుకుంటూ అక్కణ్ణించి నిష్క్రమించాడు. గడ్డంతాత కుంభకర్ణుడిలా అంగలేసుకుంటూ మధ్యమధ్య గంతులు వేస్తూ సన్న సన్నగా ఈల పాట పాడుకుంటూ సత్రం చేరుకుని స్తంభం చాటున కూర్చుని గొంతువిప్పి తృప్తితీరేలా పాడుకున్నాడు.

పిల్లలంతా అతని చుట్టూ మూగి వింతగా వంకర్లుతిరిగే అతని నోటివైపూ, ఆ పాటకి అనుగుణంగా గాలిలో తాళం వేసే అతని వేళ్లనీ, అతని ముఖంలోని హావభావాలనీ, చిరుగాలికి చూరుమీద తాటాకుల్లా అటూ ఇటూ కదిలే అతని అట్టలుకట్టిన జుట్టునీ చూస్తూ మధ్యమధ్య ఒకళ్ల ముఖంలోకి ఒకళ్లు చూసి నవ్వుకుంటూ నిలబడ్డారు.

"ఏమిటి గడ్డంతాతా అలా పాడుతున్నావు ఇవ్వాళ? నీకు పాటంకూడా వచ్చా?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఒక కుర్రాడు.

గడ్డంతాత కళ్లు తెరచి "పాటేకాదు ఇంకా చాలా విద్యలు వచ్చు" అన్నాడు.

"గోలీకాయలు ఆటంవచ్చా?" అని అడిగాడు కుర్రాడు.

"ఓ! మీరెవరన్నా పందెం వెయ్యండి చూద్దాం" అంటూ గడ్డం తాత లేచి గొంతు కూర్చుని చిటిక వేశాడు.

కుర్రాళ్లలో ఒకడికి పౌరుషంవచ్చి "రా చూద్దాం" అన్నాడు.

గడ్డంతాత లేచి వీధిలో చాలాసేపు వాళ్లతో గోలీలాట ఆడి, గెలవగల సామర్థ్యం ఉన్నా కావాలని ఓడిపోయి వాళ్ళచేత గేలిచేయించుకుని సిగ్గుపడుతున్నట్టుగా నటించి వాళ్ళ అమాయకత్వాన్ని చూచి ఆనందిస్తూ మధ్యాహ్నం చాలాసేపటివరకు గడిపేశాడు. ఆరోజల్లా అతను అలా ఆడుతూ పాడుతూనే గడిపేశాడు. అర్ధరాత్రి ఒంటిగంట వరకూ ఆకలిసంగతి ఆలోచించాల్సిన అవసరం రాలేదతనికి. అసలా సంగతే మర్చిపోయాడు. అప్పటికి పేగులు అరవటం ప్రారంభించాయి కడుపులో పోట్లు ప్రారంభించాయి ఊరంతా గాఢ సుషుప్తిలో ఉంది. భిక్షాటనకి అనువైన వేళ కాదది. అలా వళ్లమాలిన బాధ రాత్రల్లా అనుభవించాడు. తెల్లవారేసరికి ఆ పోట్లు తగ్గాయి. కాని నిన్న రోజల్లా గర్వంతో నిలబెట్ట గలిగిన నడుము ఈ ఉదయం మళ్లీ వంగిపోయింది. కడుపు వెన్నునంటుకుపోయింది. కడుపునిండా మంచినీళ్లు తాగాడు. మళ్ళీ కడుపులో పోట్లు ప్రారంభం అయే సూచనలు కనిపించగానే గబగబా ఊళ్ళోకి నడిచి ఇంటింటికీ తిరిగాడు. ఎక్కడా ప్రయో





భారమైన పనికి శ్రమపూరితమైన ఆటలకు, విద్యా జీవనానికి పుష్కలంగా పుష్టి కలిగేందుకు, మీ ఆహారములో పుష్టినిచ్చే కొంత ద్రవ్యం అదనంగా ఉండాలి. రుచికరమైనదీ మంచి సుగుణమిచ్చేదీ-'ఒవల్‌టిన్' మాత్రమే; అది చురుకుగా పనిచేసే చాలమందికి బలము. పుష్టినిచ్చే సాధనము




డిస్ట్రిబ్యూటర్లు:
గ్రాహము, ట్రేడింగ్ కంపెనీ
(ఇండియా) లిమిటెడ్.

త్రాగండి రుచికరమైన

ఓవల్‌టీన్

సిలోన్ రేడియోలో శనివారాలు రా 8 నుండి 8-30 గం వరకు ఓవల్‌టిన్ అమెచూర్ కార్యక్రమం వినండి (హిందీ-41.72 మీటర్లు)(ఇంగ్లీషు-9520 కిలో సైకిల్సు 31 మీటర్లు) ఆదివారాలు రాత్రి 8 నుండి 8 30 గం లవరకు

IV.460

జనం లేకపోయింది. మొన్న రాత్రి అన్నం పెట్టిన ఆవిడ యింటికికూడా నడిచాడు. ఎంతపిలిచినా తలుపే తెరుచుకోలేదు. హోటళ్లన్నీ తిరిగాడు లాభం లేకపోయింది. నడవగలిగే శక్తిగూడా క్రమంగా క్షీణిస్తోంది. ఓపిక చేసుకుని ఒకసత్రం చేరుకున్నాడు. స్తంభంచాటున కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకున్నాడు.

మధ్యాహ్నం మూడుగంటలయింది. గడ్డంతాత లేవాలని ప్రయత్నించాడు. కాని లేవలేకపోయాడు. కళ్లు మంటలు ప్రారంభించాయి. కీళ్లు నొప్పులు పుడుతున్నాయి. అటూ ఇటూ కదలనివ్వటం లేదు. గోలీలాడిన కుర్రాడు పరుగెత్తుకొచ్చి "కళ్లెంత ఎఱ్ఱగా వున్నాయేం తాతా?" అంటూ ప్రశ్నించాడు.

నవ్వటానికి ప్రయత్నిస్తూ "ఏమీ లేదు" అంటూ గొణిగాడు. మారు మాట్లాడకుండా వెనక్కి వెనక్కి చూస్తూ ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

సాయంత్రం చీకటిపడుతోంది. మూలుగుతున్న గడ్డంతాత భుజంమీద ఎవరో చేయి వేసి తట్టి లేపినట్టు అయి కళ్లు తెరచి చూచాడు. బూచీ! బూచీ అంటూ శక్తి కొద్దీ అతన్ని బాహువుల్లో బంధించుకుని "బూచీ నాకు ఉద్యోగం దొరికింది రోజుకు రూపాయి ఇస్తారట. సిమ్మెంటుఫ్యాక్టరీలో పని దొరికింది." అంటూ ఉప్పెనగా ముంచుకొస్తున్న ఆవేశంలో యేవేవో తొణికేకాడు.

బూచీ ముఖం అసూయతో ఎఱ్ఱబడిపోయింది. "నాకు దొరకలేదు గడ్డంతాతా!" అన్నాడు నిస్పృహగా.

"నువ్వూ ఉద్యోగంకోసమే వెళ్ళావా?"

"అవును తాతా. అందుకే వెళ్ళాను."

"భార్యా పిల్లల్ని వెతుక్కుందుకు పోతూవేమో అనుకున్నాను. మళ్ళీ వచ్చావు అదే చాలు. నువ్వంతగా విచారించకు. నాకు ఉద్యోగం దొరికిందిగా. మనిద్దరం కలసి ఎలాగో కాలక్షేపం చేద్దాం. రోజుకు రూపాయి ఇస్తుంటే ఇద్దరికి చాలకపోతుందా?"

బూచీ క్షణం నివ్వెరబోయి మరుక్షణం పశ్చాత్తాపంతో కృంగిపోయాడు. మరింత గాఢంగా గడ్డంతాతని కౌగలించుకొని "నువ్వు చాలామంచివాడివి తాతా. నాకొద్దు. నీ రూపాయి నువ్వే ఖర్చు చేసుకో." అన్నాడు.

"మరి నువ్వో?"

"ఉద్యోగం దొరికేదాకా ఇలాగే గడుపుతాను." - బూచీ తలవంచుకుని కన్నీరు దాచుకున్నాడు.

"అలా వీల్లేదు. మనిద్దరం కలిసి నా సంపాదన అనుభవిద్దాం. నువ్వు కాదనటానికి వీల్లేదు" అంటూ బూచీ 'ఊఁ!' అనేదాకా బలవంతం చేసి, ఒప్పించాడు గడ్డంతాత.

"అన్నట్టు అడగటం మరిచాను. ఒళ్లంతా వేడిగా ఉందేం? కళ్లు కూడా ఎఱ్ఱగా వున్నాయి?"

"జ్వరంవచ్చింది బూచీ. మధ్యాహ్నం నుంచీ బాధపడుతున్నాను" అని నీరసంగా సమాధానం చెప్పాడు గడ్డంతాత.

ఆరాత్రి చాలాసేపు ఇద్దరూ చాలా విషయాలు మాట్లాడుకున్నారు. ఎవరివాళ్ళని వాళ్లు తల్చుకుని కన్నీరు పెట్టుకుని ఒకళ్లని ఒకళ్ళు ఓదార్చుకున్నారు. తను ముందు ముందు వేసుకున్న పథకాలు బూచీ చెవిని వేశాడు గడ్డంతాత బూచీ వాటిని బలపరిచాడు. "తెల్లవారితే తను మనిషి అనిపించుకోగల అర్హత సంపాదించుకుంటాడు. మరో వ్యక్తినికూడా పోషించగల సమర్థుడౌతున్నాడు!" ఉద్యోగం చేసుకుంటూ రోజూ సాయంత్రం సంధ్యవెలుగులో తళతళా మెరిసే రూపాయిబిళ్ల చేతిలో పడేప్పుడు కూడా పొందలేని ఆనందం గడ్డంతాత యీ రెండురోజులూ ఊహించి అనుభవించాడు. బూచీ ఆ ఆనందాన్ని పంచుకున్నాడు.



# కాలగతిని గూర్చిన భయం

జి. వి. యస్. రామశర్మ

కాల మనేది పరబ్రహ్మ స్వరూపం. కాని ఆ కాలం గతిస్తున్న కొలదీ మానవులకు సహజంగా భయం వేయటం కద్దు. ఈ భయం దేనికి?—ఏదో ఒకనాడు తాను కూడా లోకంలో లేకపోవటం తటస్థించ వచ్చునని తలచుకొని.

జీవితానికి మొదలు అనేది యెట్లా అయితే ఉందో ఆ విధంగానే చివర అనేది గూడా ఉంది అనే సంగతి జ్ఞాపకం పెట్టుకుంటే 'మృత్యువు' అంటే ఉన్న భయం తొలగిపోవచ్చు. మన మీ ప్రపంచంలో లేకుండా ఉన్న రోజులు ఉన్నాయ్. మఱి మనం లేకుండా పోయే రోజులూ ఉన్నాయ్. ఇంక ఈ విషయాన్ని గూర్చి భయపడట మెందుకో! అక్బరు మన దేశాన్ని పాలిస్తూ ఉన్నప్పుడు నేను లోకంలో లేను. అట్టాగే నేటికి ఒక వంద యేండ్ల తరువాత ఉండబోను అనే మాట తలుచుకుని భయపడటం దేనికి. కాళిదాసు, భవభూతి మొదలైన పండితులంతా భోజరాజు కాలంలో గొప్ప ఉద్గ్రంథాలు వ్రాసి, తమ పాండిత్యాన్ని వెదజల్లుకున్న రోజుల్లో నేను లేను. రాబర్టు క్లయివు మన దేశానికి వచ్చి తుపాకులు పేల్చి ఈస్టిండియా వారి రాజ్యాన్ని స్థాపించినప్పుడూ నేను లేను. గతించిన శతాబ్దాల్లో మనం లేకపోతే ప్రపంచానికి ఏ కొదువా రాలేదు. బాగా నేనడిచిపోయింది. అటువంటి ప్రపంచాన్నించి మనం మళ్ళీ ఒకసారి లేకుండా పోతాము అనే విషయాన్ని గూర్చి భీతి యెందుకు. మరణించడమంటే మనం పుట్టక పూర్వం ఏ స్థితిలో వున్నామో తిరిగి ఆ స్థితికి పోవడమన్న మాట.

కాని మానవు లీవిషయాన్నంత తేలిగ్గా భావించరు. మనం పుట్టక పూర్వం నిరవధికమైన విశ్రాంతిలో ఉండి యున్నామన్న మాట. అప్పటికి మనం ఈ ప్రపంచంలో మన స్వల్ప పాత్రలను నిర్వహించడానికి అవతరించ లేదన్నమాట. మళ్లీ అదే రకమైన విశ్రాంతి చేకూరే స్థానానికి చేరుకో బోతామనే మాటలో వింతేమీ లేదు. విరోధుల మీగున్న విరోధం, ప్రేయసి మీదున్న ప్రేమ, మనస్సును క్రుంగదీసే విచారాలూ, శరీరాన్ని బాధించే రోగాలూ, తీర్చ వలసిన అప్పులూ ఇవన్నీ లేకుండా పోతాయి మరణించడం వల్ల. పోయిన వాళ్లంతా తిరిగి వచ్చి మాకు ఈ యీ కోరికలు యింకా తీర లేదని ఏనాడైనా ఎవరితోనైనా చెప్పారా? (పోద అడిగితే చెప్తారనుకోండి!!)

కాబట్టి వాళ్లందఱికి మృత్యువు అనేది తృష్ణవదిలించి, తృప్తి చేకూర్చిందన్నమాట. మనం పుట్టకముందు జరిగిన కలియుగ శతాబ్దాల్లో జరిగిన విషయాల్ని గురించి యెవరైనా బాధపడతారా? పడరు. ఏం?-మనకు దాంతో సంబంధం లేదనే. "ఆ శతాబ్దాల్లో జరిగిన సంగతులకు నాకూ సంబంధం ఉంద"ని ఎవరు ముందుకు వస్తారు?

ఆద్యంతా లెఱుగరాని జీవయాత్ర అనే ఊరేగింపులో మనము పాల్గొంటున్నాం. ఆ వూరేగింపులో ఒకచోటే నుంచోటానికి వీల్లేదు. తన ముందున్న వాడితోపాటు తను కూడా సాగిపోయి వెనకవచ్చే వాడికి ఆ స్థానం యివ్వాలి. మృత్యువునుగూర్చి భయపడటం అంటే-ఈ ఊరేగింపులో ఒకచోట శాశ్వతంగా నుంచుంటాననటం.

అక్బరు పరిపాలించిన నాటి చరిత్ర, అంతకుపూర్వపు చరిత్ర మనకు తెలుసు. కాని, ఈ క్షణానికి తరువాత జరుగబోయే చరిత్ర ఎవ్వరికీ తెలియదు. అట్లా తెలుసుననటం యెటువంటిదంటే చంద్రాంగారక మండలాలను చూచివచ్చా ననటంలాంటిది. (ఎందుకంటే..భవిష్యత్తును గూర్చి మన కెంత తెలుసో, చంద్రాంగారక మండలాలను గూర్చి కూడా మన కంతే తెలుసు గనుక). జీవితంమీ దుండే ప్రేమాతిశయాలవల్లనే గాని, చచ్చిపోయిన తర్వాత జరిగే సంగతిని గూర్చి మన కనవసరం. మన ఉద్దేశ్యం ఏమంటే ప్రస్తుతక్షణాన్ని శాశ్వతంగా ఉంచమంటూ ఉండటం. ఇది జరిగే విషయంగాదుకదా! మనకు ఐహిక సంబంధాలను విచ్ఛేదం చేసుకోటానికి ఇష్టముండదు. జీవితంమీద మానవునికున్న ప్రేమకి హేతు వేమంటే-జీవులు, తమతో చిరకాలం సాంగత్యంచేసిన వస్తువులమీద ఉండే మమకారాన్ని వదలలేకపోవటమే. నేడు ఉన్న

(30-వ పేజీ చూడండి)

రాత్రి రెండయ్యేసరికి ఇద్దరూ గాఢ సుషుప్తిలో మునిగిపోయారు.

* * *

రోజూ ఆలస్యంగా వచ్చే రైలు ఆ వుదయం సరైన టైముకే పెద్దగా అరుచుకుంటూవచ్చి స్టేషన్‌లో ఆగింది. బూచీ మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు. అప్పటికింకా తెల్లగా తెల్లవారలేదు. లేచి వీధిలోకెళ్ళి ముఖం కడుక్కొని తిరిగివచ్చి "తాతా! తాతా! నీకు నేమైంది" అంటూ గడ్డంతాతవీపు తట్టాడు.

గడ్డంతాత పలకలేదు!

మళ్లీ పిలిచాడు.

సమాధానం రాలేదు.

చేత్తో పక్కకి తోశాడు. ఆ కదలికలో అచేతనత్వం స్ఫురించింది. ముక్కుమీద వేలువేసి చూచాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేవు. గుండెమీద చెయ్యివేసి చూశాడు. గుండెలు కొట్టుకోవటం లేదు.

కుప్పలా గడ్డంతాతమీద పడి కుళ్లి కుళ్లి ఏడ్చాడు బూచీ. గడ్డంతాతముఖంలో ప్రేతకళ లేదు. నవ్వుతున్నట్టుగా వుంది. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా ఉంది. కడుపుమటుకు వెన్నకంటుకుపోయి వుంది. గుండెలమీద ఎముకలు మెట్లుమెట్లుగా కనిపిస్తున్నాయి.

అలా ఎంతసేపో చనిపోయిన మిత్రుడికోసం కన్నీరు ఖర్చుచేశాడు బూచీ కాని గడ్డంతాతమటుకు నవ్వుతూనే వున్నాడు.

ఉన్నట్టుండి మెరుపు మెరిసినట్టుగా బూచీకి ఒకవూహ తట్టింది. లేచి ఇవతలికి వచ్చి గబగబా వీధిలో జనాన్ని తోసుకుంటూ సిమెంటు ఫ్యాక్టరీ వైపుగా పరుగెత్తాడు. "రోజుకు రూపా యిస్తారట! ఆ అధికారికి గడ్డంతాత అయితేనేం? తనైతేనేం? అతనికి కావాల్సింది పని."—దూరంగా రాత్రి గడ్డంతాత చెప్పినట్లుగా సైరన్ హోరుమంటూ కూస్తోంది.

మరింత త్వరగా పరుగులుతీశాడు బూచీ!

★